
సాక్షి
బాపట్ల
శనివారం ǀ 3 ǀ ఫిబ్రవరి ǀ 2024



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఒడిశాలోని రూర్కేలాకు చెందిన నండూరి రమా కుటుంబం రూ. 1,00,002 విరాళాన్ని అందజేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 519.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎడమ కాలువకు 5,510 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.6200, మోడల్ ధర రూ.5400 వరకు పలికింది.

మహమ్మారికి మందు

రేపు ప్రపంచ క్యాన్సర్ డే

- క్యాన్సర్ రోగులకు భరోసా ఇస్తున్న గుంటూరు జీజీహెచ్
- ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు
- అందుబాటులో ఆధునిక వైద్యం



జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ భవన సముదాయం

గుంటూరు మెడికల్: పూర్వం రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధి వస్తే వారికి మరణమే శరణ్యం . నేడు ఆధునిక వైద్య విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందటంతో క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేస్తున్నారు. వ్యాధి ఎలా సోకుతుంది, ఎలా గుర్తించాలి తదితర ప్రాథమిక విషయాలపై అవగాహన ఏర్పరచి ప్రజల్లో క్యాన్సర్ పట్ల ఉన్న అపోహలు పోగొట్టేందుకు 2000 ఫిబ్రవరి 4న ప్యారిస్‌లో ప్రపంచ దేశాల క్యాన్సర్ వైద్యుల సమావేశం జరిగింది. నాటి నుంచి ప్రతి ఏడాదీ ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 4 వరల్డ్ క్యాన్సర్ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి 'అందిస్తున్న ప్రత్యేక కథనం.

రాష్ట్రంలో మొదటి క్యాన్సర్ సెంటర్

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్యాన్సర్ వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం, నాట్కో ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సుమారు రూ.45 కోట్లతో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో వంద పడకలతో క్యాన్సర్ వార్డు నిర్మించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 1-7-2020న వర్చువల్ విధానంలో నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించారు. అంతర్జాతీయ వైద్య సౌకర్యాలతో ప్రత్యేకంగా క్యాన్సర్ వార్డు నిర్మించిన మొట్టమొదటి ఆస్పత్రిగా గుంటూరు జీజీహెచ్ రికార్డు సృష్టించింది. క్యాన్సర్ రోగులకు తొలి రిఫరల్ ఆస్పత్రిగా కూడా గుంటూరు జీజీహెచ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఆపరేషన్ల కోసం ప్రత్యేకంగా రూ.60లక్షలతో థియేటర్స్ నిర్మించారు.

జీజీహెచ్ క్యాన్సర్ వార్డు ప్రత్యేకతలు

ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో ఐదు అంతస్తుల్లో క్యాన్సర్ సెంటర్ నిర్మాణం జరిగింది.




అత్యాధునిక ఆపరేషన్ థియేటర్

రేడియేషన్ ఆంకాలజి, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ డిపార్టుమెంట్, రేడియోథెరపీ డిపార్టుమెంట్, సర్జికల్ ఐసీయూ, మెడికల్ ఐసీయూ గదులు ఏర్పాటు చేశారు.

ఆధునిక వైద్య పరికరాలు

క్యాన్సర్ రోగులకు ఆధునిక వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయల ఖరీదు చేసే వైద్య పరికరాలను జీజీహెచ్‌కు అందజేసింది. సుమారు రూ.15 కోట్లు ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరాన్ని, రూ.2 కోట్లు ఖరీదు చేసే బ్రాకీథెరపీ, రూ.5.50 కోట్ల సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలు ప్రభుత్వం విదేశాల నుంచి తెప్పించింది. సుమారు రూ.15 కోట్లు ఖరీదు చేసే పెట్ సీటీ వైద్య పరికరాన్ని సైతం మంజూరు చేసింది. త్వరలోనే వైద్య పరికరం ఆస్పత్రికి రానుంది. నాట్కో ట్రస్ట్ కోటి రూపాయలతో మామోగ్రామ్ వైద్య పరికరం అందుబాటులోకి తెచ్చింది. అన్ని రకాల ఆపరేషన్లు చేసేందుకు కోటి రూపాయలతో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ నిర్మాణం చేశారు.



లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరం

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌ను నయం చేసే ఆధునిక వైద్య పద్ధతులు గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాన్సర్ నివారణే లక్ష్యంగా వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. మంత్రి విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్

100 పడకలతో మరో క్యాన్సర్ భవనం



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అందుతున్న వైద్యసేవలను ప్రభుత్వం గుర్తించి లెవల్-1 క్యాన్సర్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసింది. ప్రభుత్వం ఇటీవల కాలంలో 1250 గజాల స్థలాన్ని నాట్కో ట్రస్టుకు కేటాయించింది. ఆ స్థలంలో సుమారు రూ.12 కోట్లతో 100 పడకలతో మరో భవన నిర్మించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వానికి నాట్కో ట్రస్ట్ ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తోంది.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్

ఉచితంగా క్యాన్సర్ మందులు



క్యాన్సర్ రోగులకు నాట్కో ట్రస్ట్ ప్రతి ఏడాదీ రూ.2 కోట్ల ఖరీదు చేసే మందులు ఉచితంగా అందిస్తుంది. రోగులకు మెరుగైన వైద్యం, కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ వీసీ నన్నపనేని కార్యక్రమాలు చేస్తున్నారు.

– యడ్లపాటి అశోక్‌కుమార్, నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్

వారసుడొచ్చాడు

- వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉమ్మారెడ్డి వెంకటరమణ
- ప్రకటించిన పార్టీ అధిష్టానం
- హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు
- శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డికి కుమారుడు
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు బావమరిది
- రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా ఉమ్మారెడ్డి వెంకటరమణను పార్టీ అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. రాజకీయ వారసత్వం ఉండి విద్యాధికుడిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. మాస్టర్స్ డిగ్రీతోపాటు హైదరాబాద్ బిజినెస్ స్కూల్‌లో పీహెచ్‌డీ చేశారు. వెంకటరమణ తండ్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు శాసనమండలిలో చీఫ్ విప్‌గా, కేంద్ర మంత్రిగా, ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న సంగతి తెలిసిందే. వెంకటరమణ సోదరులు హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వహణ బాధ్యతలు చూస్తుంటారు. సోదరి లక్ష్మీసరస్వతి భర్త కిలారి వెంకటరోశయ్య పొన్నూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడంతో ప్రజా సమస్యలపైన అవగాహన ఉంది. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి కదన రంగంలోకి వైఎస్సార్ సీపీ దిగింది. పొత్తుల గోల తేలకపోవడంతో టీడీపీ, జనసేన డైలమాలో ఉన్న సంగతి తెలిసిందే. గుంటూరు ఎంపీగా రెండుసార్లు గెలిచిన గల్లా జయదేవ్ కాడిపడేయడంతో మరో అభ్యర్థి కోసం టీడీపీ గాలిస్తోంది. మాజీ మంత్రి ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, విద్యాసంస్థల చైర్మన్ కోసం ప్రయత్నించినా పోటీ చేయడానికి సిద్ధంగా లేకపోవడంతో ఎన్‌ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్‌ని ఖరారు చేసే పనిలో ఉన్నారు.

న్యూస్‌రీల్

రేషన్ పంపిణీలో జాగ్రత్తలు తీసుకోండి



బాపట్ల : నిత్యావసర సరుకుల పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో నిత్యావసర సరుకుల పంపిణీ విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పంపిణీలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ విలియమ్స్, ఆర్డీఓ రవీంద్రబాబు, తహసీల్దార్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 92 శాతం పూర్తి



నరసరావుపేట: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ రెండో రోజు శుక్రవారం సాయంత్రం తొమ్మిది గంటలకు 92 శాతం పూర్తయింది. జిల్లాలోని 28 మండలాలు, పురపాలక సంఘాల్లో 2,84,006 మందికి రూ.84.82 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 2,59,992 మందికి రూ.77.64 కోట్ల సొమ్మును పంపిణీ చేశారు.

కోన ప్రభాకరరావు కళా వేదిక ప్రారంభం



బాపట్ల అర్బన్ : ఏవీవీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన కోన ప్రభాకరరావు కళా వేదికను ఎమ్మెల్యే కోన రఘుపతి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పలు సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోన రఘుపతిని విద్యాభివృద్ధి సంఘం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రెసిడెంట్ బి.హరినాథ మురళి, పి. రఘురాం, ట్రెజరర్ సుబ్బారాయుడు, టి. సుబ్బారావు, దీక్షితులు, సురగాని మురళీధర్, శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎస్.వి. ఆర్.వి.ప్రసాద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణం సాధించిన లిఫ్టర్‌కు సత్కారం



తెనాలి : తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పతకం సాధించిన తెనాలి యువకుడు నర్రా వెంకట మహేష్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 73 కిలోల విభాగంలో తలపడిన వెంకట మహేష్ ప్రథమ స్థానం సాధించి, స్వర్ణపతకం అందుకున్నాడు. అతడిని శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, భవిష్యత్‌లో మరిన్ని విజయాలను అందుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, తాడిబోయిన రమేష్, మల్లెబోయిన రాము పాల్గొన్నారు.

నేడు పీఎఫ్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్ : కృష్ణనగర్‌లోని పీఎఫ్ కార్యాలయంలో శనివారం విశ్రాంత ఉద్యోగులకు రమేష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు భవిష్యనిధి పెన్షనర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాజ్ హుస్సేన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న వైద్య శిబిరంలో సంఘ సభ్యులు హాజరు కావాలని సూచించారు. విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్త్రీలకు క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

- 'పల్లె పల్లెకు చిన హనిమిరెడ్డి'
- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు
- వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభించిన సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి (సంతమాగులూరు): రాబోయే ఎన్నికల్లో రాష్ట్రమంతా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. పల్లెపల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం సంతమాగులూరు మండలం గురిజేపల్లి గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలో వీధివీధి తిరుగుతూ చిన్నా,పెద్ద, వృద్ధులతోపాటు యువకులను కలసి వారితో ముచ్చటించారు. సమస్యలు తెలుసుకుని నేనున్నానంటూ భరోసానిస్తూ ముందుకు సాగారు. గ్రామానికి వచ్చిన సమన్వయకర్తకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.

ప్రతిపక్షాల మాటలతో మోసపోవద్దు..

సమన్వయకర్త పానెం మాట్లాడుతూ గతం ఒక ఎత్తు ప్రస్తుతం మరో ఎత్తు అన్నారు. నేను మీకు అండగా ఉంటానని చెప్పారు. ఏ సమస్య ఉన్నా నిర్భయంగా నాయకులతో పనిలేకుండా నేరుగా వచ్చి తనతో చెప్పుకోవచ్చన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో కుల, మత, వర్గ, పార్టీ రహితంగా పనులు చేయడానికి సిద్ధమన్నారు. ఎన్నికలు సమీస్తున్న తరుణంలో ప్రజలంతా సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరలా తెచ్చుకోవాల్సిన అవసరం ఆంధ్రప్రదేశ్‌కు ఉందన్నారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీ తరుపున తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దన్నారు. సీఎం పీఠం ఎక్కిన తరువాత వాగ్దానాలను మరచిపోయి ప్రజలను మోసం చేసే నాయకులను గెలిపిస్తే సంక్షేమం కుంటుపడుతుందన్నారు. ప్రజల గుండెల్లో పదిలంగా గూడు కట్టుకున్న సీఎం జగన్‌ను ఓడించడం చేత కాక పది పార్టీలు ఏకమై ఓడించాలని చూస్తున్నాయన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా జనం జగన్‌వైపే ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దబ్బాయి, పార్టీ మండల కన్వీనర్ చింతా రామారావు, జెడ్పీటీసీ అడవి శ్రీనివారావు, ఎంపీటీసీ ఎస్ వెంకటేశ్వర్లు మరియమ్మ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇప్పల ముసలారెడ్డి, పార్టీ నాయకులు మల్లీష్, దమ్ము శ్రీను, కార్యకర్తలు, వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మత్స్యసాగుకు ప్రభుత్వం చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వచ్చేలా మత్స్య సాగుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం జిల్లాస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. జిల్లాలో 19 యూనిట్ల స్థాపనకు కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ముఖ్యోద్దేశమని చెప్పారు. బయో ఫ్లాక్ టెక్నాలజీ ద్వారా ఆక్వా సాగుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అధునాతన సాంకేతిక విధానంతో ఆక్వా సాగు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఒక్కొక్క యూనిట్ రూ.50 లక్షలతో స్థాపించేందుకు పారిశ్రామిక ఔత్సాహికులు ముందుకు వచ్చారన్నారు. 15 యూనిట్లను ప్రారంభించడానికి కలెక్టర్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు యూనిట్లు రూ.50 లక్షలకు పైగా విలువ చేసేవని చెప్పారు. తద్వారా మత్స్య సంపద విస్తృతంగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. తక్కువ ఖర్చు, పెట్టుబడులతో ఆదాయం మరింతగా పెరుగుతుందని వివరించారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి పి.సురేష్, ప్రకాశం జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్.కృష్ణ, ఎల్‌డీఎం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు లైఫ్ జాకెట్ల పంపిణీ



మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేస్తున్న ఎం.రవీంద్ర

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం ముత్తాయపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామానికి చెందిన బోట్ యజమానులకు శుక్రవారం సాయంత్రం లైఫ్ జాకెట్లను అందజేశారు. ఆదర్శనగర్‌లోని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద సీ-సేఫ్టీ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 75 శాతం సబ్సిడీపై లైఫ్ జాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి ఎం.రవీంద్ర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వేటకు వెళ్లే ప్రతి బోటులో సీ-సేఫ్టీ పరికరాలను తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. విపత్తు సమయంలో ఈ పరికరాలే మత్స్యకారులకు ప్రాణ రక్షణ కవచాలుగా ఉపయోగపడతాయన్నారు. ప్రతి బోట్ యజమాని సబ్సిడీతో అందచేస్తున్న పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సంఘ డైరెక్టర్ కన్నా మామిడయ్య, వై.ఎం.శివశ్రీ , ముత్తాయపాలెం, అడవి 2 పంచాయతీ సాగరమిత్రలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌తో విద్యుత్ సమస్యలకు పరిష్కారం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఆమంచి

- వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి
- రెండో సబ్‌స్టేషన్ ప్రారంభం

మార్టూరు: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న మార్టూరుకు రెండో సబ్‌స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన 33 కేవీ/11 కేవీ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం గ్రామ సర్పంచ్ భూక్యా సునీతాబాయి, ఎంపీపీ భూక్యా శాంతిబాయిలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 40 సెంట్ల భూ విస్తీర్ణంలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ వలన 4 వేల మంది వినియోగదారుల అవసరాలను తీర్చనున్నట్లు తెలిపారు. రెండోసబ్ స్టేషన్ ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరడమే కాకుండా గ్రానైట్ పరిశ్రమలకు, వ్యవసాయానికి సాధారణ గృహ వినియోగదారుల అవసరాలను తీర్చనుందని తెలిపారు. అద్దంకి డివిజన్ ఈఈ నర్రా మస్తాన్‌రావు మాట్లాడుతూ రెండో సబ్‌స్టేషన్‌ను విభజించి ఆయా ప్రాంతాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, డీఈ కే అంజిరెడ్డి, ఏఈలు ఎన్ శ్రీనివాసరావు, కేవై రమేష్, సబ్ ఇంజినీర్ హనుమంతరావు, మండల పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్‌లకు చీరాల అనుకూలం

హీరో సంపూర్ణేష్‌బాబు



సముద్రతీరంలో బైక్‌పై సందడి చేస్తున్న సంపూర్ణేష్‌బాబు

చీరాల టౌన్: తక్కువ బడ్జెట్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో సినిమాల చిత్రీకరణకు చీరాల, వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతాలు అన్నివిధాలుగా అనుకూలంగా ఉన్నాయని సినీ హీరో సంపూర్ణేష్‌బాబు అన్నారు. శుక్రవారం రామాపురం సముద్ర తీరప్రాంతంలో బైక్‌పై తిరుగుతూ సంపూర్ణేష్‌బాబు సందడి చేశారు. రామాపురంలోని పామ్‌కోస్ట్ రిసార్ట్స్‌లో బస చేసిన హీరోను ప్రముఖ వైద్యులు అన్నె భవానీప్రసాద్, కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. చీరాల ప్రాముఖ్యం, షూటింగ్‌లు చేసుకునేందుకు అన్నీ వసతులు, సదుపాయాలు అనుకూలంగా ఉన్న చీరాల ప్రాంతం సినీ రంగానికి తక్కువ బడ్జెట్‌లో చిత్రీకరణకు బాగా అనుకూలమని హీరోకు వివరించారు. కళాకారులు, ప్రతిభ కలిగిన యువతీయువకులు చీరాలలో ఉన్నారని వారికి అవకాశాలు కల్పించాలని కోరారు. హీరో మాట్లాడుతూ సినిమాల చిత్రీకరణకు చీరాల పట్టణం, సముద్రతీర గ్రామాలు చక్కగా ఉన్నాయని, చీరాల్లో సినిమా షూటింగ్ చేసేలా కృషి చేస్తానన్నారు. వస్త్ర వ్యాపారం, పర్యాటక రంగం, చైతన్యానికి మారుపేరైన చీరాల్లో సినిమా తప్పక తీస్తానని సంపూర్ణేష్ తెలిపారు.

నేడు 'జగనన్నకి చెబుదాం'

వేమూరు(చుందూరు): చుందూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జగనన్నకి చెబుదాం కార్యక్రమం శనివారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దారు కనకదుర్గ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు రంజిత్ బాషా పాల్గొంటారని తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



బాపట్ల టౌన్: విద్యుదాఘాతంలో కార్మికుడు మృతి చెందిన ఘటన బాపట్ల పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని హయ్యర్ నగర్‌కు చెందిన దాసి ప్రదీప్‌కుమార్(24) గత కొన్ని సంవత్సరాలుగా పెయింట్ పని చేస్తూ తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. శుక్రవారం పట్టణంలోని వివేకానంద కాలనీలో డాబాపై పనిచేస్తున్న సమయంలో విద్యుదాఘాతంతో స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు విద్యుత్ వైర్‌ను పక్కకు తొలగించి స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: అప్పుల బాధతో పట్టణానికి చెందిన వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వినుకొండ రోడ్డులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని బరంపేటకు చెందిన కంచర్ల ఏడుకొండలు(55) రియల్ ఎస్టేట్‌తో పాటు కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో దాదాపు రూ.25 లక్షలు వరకు అప్పులు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిడి అధిక కావడం అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఇంటి నుంచి వచ్చిన ఏడుకొండలు వినుకొండ రోడ్డు కామిరెడ్డి నగర్‌లోని ప్లాట్లలో మృతిచెంది ఉన్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో శుక్రవారం ఉదయం రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ రోశయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

పిడుగురాళ్ల: యువకుడు వేధింపులతో బాలిక మృతి చెందిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ వీవీ ఆంజనేయులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌కు చెందిన చెరుకూరి క్రిస్టినా(16) సోషల్ మీడియాలో ఓ యువకుడు వేధింపులకు పాల్పడుతుండటంతో మనస్తాపానికి గురై జనవరి 31వ తేదీన తన ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు చూసి వెంటనే చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. బాలిక తండ్రి శామ్యూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడిన వారికే ఉన్నతస్థానం

- విజ్ఞాన్ వర్సిటీ వీసీ నాగభూషణ్
- రెండోరోజు వైభవంగా కొనసాగిన విజ్ఞాన్ మహోత్సవ్
- పోటాపోటీగా సాగిన పోటీలు





కబడ్డీలో పోటీ పడుతున్న టీం(ఇన్‌సెట్)లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చేబ్రోలు: జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు, వారు ఎంచుకున్న రంగంలో బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ అన్నారు. మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం సందడిగా సాగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సాధించలేనేమో అనే భయం, సందేహాలకు జీవితంలో ఎప్పుడూ తావివ్వొద్దని సూచించారు. అలాగే క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా ఎంతో దోహదపడుతాయని వీసీ వివరించారు.

సందడిగా..

విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు సాగాయి. అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందేలను నిర్వహించారు. వీటితో పాటు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. విద్యార్థులు సోలో సాంగ్స్, లఘు నాటికలు, రెట్రో డాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. కల్చరల్స్, లిటరరీ, ఫైన్ ఆర్ట్స్, ఫ్యాషన్ స్కెచ్చింగ్ పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఇండియన్ నేషనల్ క్రికెట్ టీం మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్, ఇండియన్ ఫిల్మ్ యాక్టర్ కిరణ్ అబ్బవరం, ఇండియన్ స్క్రీన్ రైటర్ బుర్రా సాయి మాధవ్‌లు హాజరవుతున్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో డివిజన్‌కు ప్రాధాన్యం

- అభివృద్ధి పథంలో నడిచేందుకు దోహదం
- డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ



లక్ష్మీపురం: కేంద్రం ప్రవేశ పెట్టిన రైల్వే బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్ అభివృద్ధి, 2024–25లో పలు ప్రాజెక్ట్‌ల కోసం నిధులు మంజూరు చేయడంపై గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ కేటాయింపులతో డివిజన్ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. డివిజన్‌లో 2024–25లో మంజూరు చేసిన ప్రాజెక్ట్‌లలో ప్రధానంగా నడికుడి–శ్రీకాళహస్తి నూతన లైన్ ప్రాజెక్టు కోసం రూ.450 కోట్లు కేటాయించారన్నారు. అలాగే గుంటూరు–గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్ట్ కోసం రూ.283.50 కోట్లు కేటాయింపులు చేశారని వివరించారు. గుంటూరు–బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు కోసం రూ.200 కోట్లు కేటాయించడం జరిగిందని, అదే విధంగా స్టేషన్‌ల ప్రధాన పునరాభివృద్ధి, సాఫ్ట్ అప్ గ్రేడేషన్ కోసం రూ.425 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. స్టేషన్లలో పాదచారుల వంతెనలు, ఎత్తైన ప్లాట్ ఫాంల ఏర్పాటు కోసం రూ.197 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే గుంటూరు యార్డు మల్టీ ట్రాకింగ్ అనుసంధానానికి రూ.50 కోట్లు, వందే భారత్ రైళ్ల నిర్వహణ సౌకర్యాల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేశారని వివరించారు. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ కేటాయించిన బడ్జెట్‌తో డివిజన్‌లో మంజూరు చేసిన ప్రాజెక్ట్‌లను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు అన్ని విధాల సదుపాయాలు కల్పించేందుకు డివిజన్ ఆయా విభాగాధిపతులు సిద్ధంగా ఉన్నామన్నారు.

మద్యం మత్తులో వివాహిత హత్య

వినుకొండ(నూజెండ్ల): మద్యం మత్తులో భార్యను హత్య చేసిన ఘటన పట్టణంలోని మసీదు మాన్యంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ సాంబశివరావు తెలిపిన వివరాలు... అంగలకుదురు కోటేశ్వరి(34), పోతులూరయ్యాచారి భార్యాభర్తలు. వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. ఇద్దరి కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి మద్యం మత్తులో భార్య కోటేశ్వరిని గడ్డపారతో నరికి చంపాడు. అనంతరం పరార్ అయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సీఐ సాంబశివరావు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యార్డులో 1,21,190 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,12,141 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,21,190 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,863 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

పశుపోషకులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం

- పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు
- లేగ దూడల అందాల పోటీలు నిర్వహణ



లేగ దూడల అందాల పోటీలు పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

మున్నంగివారిపాలెం(వేమూరు): పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. చుండూరు మండలం మున్నంగివారిపాలెంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేక దూడల అందాల పోటీలను ఎంపీపీ జాలాది రూబేను శుక్రవారం నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ లేగ దూడలను ఆరోగ్యకరంగా ఉంటే పాల దిగుబడితో పాటు ఆదాయం బాగా ఉంటుందని చెప్పారు. పశు సంవర్ధక శాఖ తెనాలి డెప్యూటీ డైరెక్టర్ వై.కేదారేశ్వర్ మాట్లాడుతూ లేగ దూడలను పశు పోషకులు సంరక్షించాలని సూచించారు. వేమూరు సహాయ సంచాలకులు కేవీ జనార్ధనరావు మాట్లాడారు. ఈ పోటీల్లో 48 లేగ దూడలు పాల్గొనగా ప్రథమ బహుమతి కోసన రమేష్, ద్వితీయ బహుమతి మారిశెట్టి కోటయ్య, వెనిగళ్ల వెంకయ్య, తృతీయ బహుమతి ఖడ్గం వెంకయ్య, మెలికా గంగాధర్‌లకు చెందిన దూడలు నిలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ బాలశంకర్, సర్పంచి అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉయ్యూరి మురళీ జగన్మోహన్ రెడ్డి, మండల పశు వైద్యాధికారి చల్లా చలపతిరావు, ఆషాజ్యోతి, ఎస్.మునియ్య, అపర్ణ పాల్గొన్నారు.

కష్టపడి ఇష్టంతో చదవండి

హాకీ క్రీడాకారిణి రజిని



వెల్లటూరు జెడ్పీ హైస్కూల్లో హాకీ క్రీడాకారిణి రజని, ఆదిత్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

బొల్లాపల్లి: కష్టపడి ఇష్టంతో చదవాలని హాకీ జాతీయ క్రీడాకారిణి ఈ.రజిని సూచించారు. భర్త స్వగ్రామమైన మండలంలోని వెల్లటూరు శుక్రవారం వచ్చారు. తొలుత సుబ్బుగురుయోగేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు జెడ్పీ హైస్కూల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. పాఠశాల వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ మీ ఆదరణ, అభిమానాలు నా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నాయని, ఇలాంటి సన్మానాలు, అభినందనలు ఎన్నటికి మరువలేనన్నారు. ఈ గ్రామం నా మెట్టినిల్లు కావడం సంతోషంగా ఉందని చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన భర్త ఆదిత్య, కుటుంబ సభ్యుల సహకారంతో జాతీయ క్రీడ హాకీలో కెప్టెన్ స్థాయికి ఎదిగినట్లు వివరించారు. పలు దేశాల్లో పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు, గురువు అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అనంతరం హాకీ క్రీడాకారిణి రజని, ఆదిత్య దంపతులను గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

నిబంధనలు ఉల్లంఘించిన స్కూల్ బస్సులపై చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి

నరసరావుపేట రూరల్: స్కూల్ బస్సులను నిబంధనలు ఉల్లఘించి నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి టీకే పరంధామరెడ్డి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణా కార్యాలయంలో శుక్రవారం స్కూల్ బస్సు యజమానులకు, ట్రాన్స్‌పోర్ట ఇన్‌చార్జిలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల రవాణా విషయంలో నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు. బస్సులను కండీషన్‌లో ఉంచుకోవాలని కోరారు. స్కూల్ బస్ డ్రైవర్లకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని యాజమాన్యాలను ఆదేశించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి స్కూల్ బస్‌లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణించకూడదని, ఎమర్జెన్సీ డోర్ ఉండాలని కోరారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు, రోడ్‌సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ నవ్య పాల్గొన్నారు.

ఏఎస్పీ సుప్రజ అభినందనీయురాలు

ఎస్పీ తుషార్ డూడి



ఏఎస్పీ సుప్రజను సత్కరిస్తున్న ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు

పట్నంబజారు: ఏఎస్పీ సుప్రజ (అడ్మిన్) అభినందనీయురాలని ఎస్పీ తుషార్ డూడి కొనియాడారు. జిల్లా అడిషనల్ ఎస్పీగా పనిచేసి ఏసీబీకి బదిలీ అయిన ఆమెను జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. సభకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై పుష్పగుచ్ఛం అందజేసి ఆమెను సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ సుప్రజ గుంటూరు నగరంలోని ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్‌ల డీఎస్పీగా పనిచేసి ఎన్నో కేసుల్లో పురోగతి సాధించి నిందితులకు శిక్ష పడే విధంగా పాటుపడ్డారన్నారు. దిశ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా విధులు నిర్వహించిన సమయంలో మహిళలకు సంబంధించిన పలు కేసుల్లో ఆమె చేపట్టిన చర్యలు మహిళలకు ఎంతో మనోధైర్యాన్ని కల్పించాయన్నారు. మహిళా అధికారిగా, మచ్చలేని మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్న ఏఎస్పీ సుప్రజ ఏ విభాగంలో పనిచేసినా ఆ విభాగానికి వన్నె తెస్తారన్నారు. అనంతరం పలువురు అడిషనల్ ఎస్పీలు, ఏఎస్పీ సుప్రజను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శాంతికుమార్, ఆర్‌ఐలు, సీఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సహకారం మరువలేనిది

గుంటూరు జిల్లాలో అనేక సబ్ డివిజన్‌లలో పనిచేసిన తనకు అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనిది. ఎన్నో కేసుల్లో నిందితులకు శిక్షపడేలా తాను చేపట్టిన విచారణలో సిబ్బంది సహకారం అభినందనీయం. పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బంది సహకరించడం వల్లే తాను మంచి అధికారిగా గుర్తింపు లభించింది. జిల్లాతో నాకున్న అనుబంధం మరువలేనిది.

– కె.సుప్రజ, ఏఎస్పీ

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందాలి

అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యులకు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ సూచన



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలిటౌన్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందాలని, ఇందుకోసం మెరుగైన చర్యలు చేపట్టాలని వైద్యులకు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం వైద్యశాలలో జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా సబ్‌కలెక్టర్ పాల్గొన్నారు. వైద్యులు, కమిటీ సభ్యులతో పలు అంశాలపై చర్చించారు. జమ ఖర్చులు, తదితర అంశాలపై చర్చ నిర్వహించారు. తొలుత వైద్యశాలలోని పలు విభాగాలను సబ్ కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. క్యాజువాలిటీ, ఓపీ, బ్లడ్ బ్యాంక్, తదితర విభాగాలను ఆయన తనిఖీ చేశారు. సమావేశంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి, ఏవో డాక్టర్ మజీదా బీ, ఆర్‌ఎంవోలు డాక్టర్ మస్తాన్‌వలీ, డాక్టర్ సురేష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, వైద్యశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరేడ్కో రథసారథికి పురస్కారం

పాత గుంటూరు: జిల్లాకు చెందిన జ్యోతిర్మయి ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, నరేడ్కో అధ్యక్షుడు పెరవలి నాగవంశీకి 'రియల్ ఎస్టేట్ డెవలపర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కింది. శుక్రవారం న్యూఢిల్లీలోని హోటల్ తాజ్ ప్యాలెస్‌లో జరిగిన 16వ నరేడ్కో జాతీయ కన్వెన్షన్‌లో క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ చేతుల మీదుగా నాగవంశీ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నరేడ్కో ప్రతినిధులు, బిల్డర్లు, ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలి



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న మోస్ట్ రెవ.గోవిందు జోజి, ఫాదర్లు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి తిరునాళ్ల అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో శుక్రవారం ప్రారంభించారు. చర్చి విచారణ గురువులు ఫాదర్ యేరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం పండుగ మహోత్సవ సమష్టి దివ్యపూజాబలిలో భక్తులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన నల్గొండ మేత్రాసన విశ్రాంత పీఠాధిపతులు మోస్ట్ రెవ.గోవిందు జోజి సందేశమిస్తూ కన్యమరియ తల్లి తన తొలిచూలు కుమారుడైన ప్రభువైన ఏసుక్రీస్తును సమస్త మానవాళిని రక్షించుటకై దేవాలయంలో దేవునికి సమర్పించిందని పేర్కొన్నారు. కథోలికులు క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ ఆరాధిస్తూ ఇతరులపై ప్రేమ, దయ, కరుణ చూపుతూ జీవించాలని అన్నారు. పరిపూర్ణమైన హృదయం కలిగి విశ్వాసంతో ప్రార్థిస్తే కష్టనష్టాలు తొలిగి పోతాయని చెప్పారు. సమాజంలో నెలకొన్న అశాంతి తొలిగిపోవాలంటే ప్రభువు చూపిన బాటలో నడవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యలకు శాంతి సమాధానాలే పరిష్కారమార్గాలని, క్రైస్తవులందరూ తమ బాధలను, కష్టాలను దేవునికి సమర్పించినట్లు అయితే వారిని అమితంగా ఆశీర్వాదిస్తారని వివరించారు. ఇరుగు పొరుగు వారిని దయాహృదయంతో ఆదుకోవాలన్నారు. కుల మతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు ఈ దివ్యపూజాబలి లో పాల్గొని కానుక మాత ఆశీస్సులు పొందారు. సాయంత్రం 3గంటల నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులు కరుణకల్గిన కానుకమాతకు కొవ్వొత్తులను సమర్పించి తమతమ మొక్కులను చెల్లించుకున్నారు.

ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రార్థనలు..

కరుణామయురాలైన కానుకమాత దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. స్థానిక కానుకమాత చర్చి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విచారణ డీకన్ బ్రదర్ కె.నిఖిల్ ఎమ్మెల్యేకు, పీఆర్‌కు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జి. బ్రహ్మరెడ్డి, దుర్గి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ సర్పంచి ఎ.ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఎం.ఉమ, యూత్ అధ్యక్షుడు కె.సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బి.మరియదాసిరెడ్డి, పార్టీ నాయకులు పి.రామయ్య, వై.విజయ భాస్కర్ రెడ్డి, పి.ముత్తయ్య, టి.ఇన్నారెడ్డి, వై.ప్రతాప్‌రెడ్డి, జి.సైదారెడ్డి, కె.మర్రెడ్డి, పి.సీతారామిరెడ్డి, బి.తిరుపతిరావు, జి.భాస్కర్‌రెడ్డి, దేగల సంసోన్ పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో చిత్తడి నేలల దినోత్సవం



పెదకాకాని: ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ మహబూబ్ బాషా ఆదేశాల మేరకు గుంటూరు రేంజ్ ఆఫీసర్ పోతురాజు ఆధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవం ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రదానోపాధ్యాయుడు పర్యవేక్షణలో స్కూల్ పిల్లలకు వ్యాసరచన, డ్రాయింగ్ చిత్తడి నేలల మీద కాంపిటీషన్ పరీక్ష పెట్టడం నిర్వహించారు. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు పక్షుల కేంద్రం చైర్మన్ పెరుమాళ్ళ అనిల్ కుమార్, డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, బీట్ అధికారి సంతోష్, ఉపాధ్యాయిని స్వరూపరాణి, మాస్టర్ పి.రామారావు బహుమతులు ప్రదానం చేసి వారికి చిత్తడి నేలల గొప్పతనాన్ని తెలిపారు.